

'కడెం' క్రాప్ హాలీడే
కడెం ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గిపోయాయి. 4.02 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రధాన కెనాల్‌కు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. 8లో▸



చి'వరి'కి నిరాశే..! 9లో▸
వానాకాలం సీజన్‌లో వర్షాభావం, తెగుళ్లు రైతులను కుదేలు చేశాయి. వరి పంటలో ఈసారి దిగుబడి గణనీయంగా తగ్గింది.

గరిష్టం/కనిష్టం
27.1/13.5
వాతావరణం
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. చలి ప్రభావం కొనసాగుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, క్రైమ్ రికార్డులు, సిబ్బంది రిజిస్టర్లను పరిశీలించారు. కేసుల వివరాలు, దర్యాప్తు, పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి సూచనలు చేశారు. బాధితులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై కొమురయ్య తదితరులు ఉన్నారు.

రేపు జిల్లా కేంద్రంలో జాబ్ మేళా

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పీఎంకేకే కేంద్రంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు శ్రీవిజయ బయో ఫర్టిలైజర్స్ కంపెనీ లిమిటెడ్‌లో సేల్స్ రిప్రజెంటేటివ్ పోస్టుల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 60 పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ లేదా ఇంటర్మీడియెట్ విద్యార్హత కలిగి, 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల వేతనంతోపాటు కమీషన్, ఇన్సెంటివ్‌లు, ఉచిత వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99081 87894, 94405 14962 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన బాట



నిరసన ర్యాలీలో ఆటో డ్రైవర్లు

కాగజ్‌నగర్‌టౌన్: ఆటో డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ఉపాధి దెబ్బతింటుందని రోడ్డెక్కారు. బుధవారం కాగజ్‌నగర్‌లో లారీ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఫైనాన్స్‌లో కొన్న ఆటోలకు నెలనెలా ఈఎంఐలు కట్టలేని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పించి ఆదుకోవాలంటూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని, ప్రతినెలా జీవన భృతి రూ.10వేలు, ప్రతి ఆటో డ్రైవర్‌కు జీవిత బీమా రూ.5 లక్షల పాలసీ సౌకర్యం కల్పించాలని కోరారు. సర్కారు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆటో కార్మికుల ఆందోళనకు సీపీఎం నాయకులు ముంజం ఆనంద్ మద్దతు పలికారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనాథ్ వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులను బుధవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నవంబర్ 7న ఉట్నూర్‌లో నిర్వహించిన ఎస్‌డీఎఫ్ జోనల్‌స్థాయి ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన భూపతి, నాగరాజు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ శంకర్, పీఈటీ యాదగిరి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నుంచి అండర్– 19 విభాగంలో జోనల్‌స్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ శ్రీనాథ్, డీఐఈవో శంకర్ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు.



కోవిడ్ అలర్ట్!

- దేశంలో మళ్లీ కరోనా అలజడి
- కేరళలో కొత్త సబ్ వేరియంట్ 'జేఎన్–1'
- వేగంగా కొత్త కేసుల నమోదు
- జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచన
- అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ

ఆసిఫాబాద్: దేశంలో కరోనా అలజడి మళ్లీ మొదలయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. రూపాంతరాలు మార్చుకుంటున్న కోరలు చాస్తున్న కరోనా మహమ్మారిపై కేంద్ర ప్రభుత్వం మరోసారి రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఇటీవల కేరళలో కొత్త సబ్ వేరియంట్ జేఎన్– 1 వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. చాలా కాలం తర్వాత దేశంలో కోవిడ్ –19తో మరణాలు సంభవించడంతో కేంద్ర ప్రభుత్వం సోమవారం రాష్ట్రాలను అప్రమత్తం చేస్తూ కీలక సూచనలు చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సూచనల మేరకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించేందుకు కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైతే టెస్టుల సంఖ్యను పెంచాలని సూచించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కోవిడ్ చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూనే.. కేంద్ర ఆరోగ్యశాఖ చేపట్టే మాక్‌డ్రిల్స్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆదేశాలు జారీ చేసింది.

సెకండ్ వేవ్‌తో జిల్లా అతలాకుతలం

కుమురంభీం జిల్లాలో కోవిడ్– 19 మొదటి వేవ్ ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. ఆ సమయంలో అధికారులు గిరిజనులకు విస్తృతంగా అవగాహన కల్పించడంతోపాటు వైరస్ కట్టడికి పకడ్బందీ చర్యలు చేపట్టారు. రెండో విడతలో మాత్రం కోవిడ్ ప్రజలను అతలాకుతలం చేసింది. 2020 ఏప్రిల్ 8న జిల్లాలో అధికారికంగా మొదటి కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. జూలై కేసుల ఉధృతి పెరిగి కరోనా కోరలు చాచింది. ఫలితంగా 2020 ఆగస్టులో తొలి మరణం నమోదైంది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి కోవిడ్‌తో ప్రాణాలు కోల్పోయాడు. పాజిటివ్ కేసుల సంఖ్య పెరగడంతో పదుల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం కోవిడ్ టీకాలను అందుబాటులోకి తేవడంతో కేసుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. వ్యాక్సినేషన్‌లో భాగంగా ఫస్ట్ డోస్, సెకండ్ డోస్, ప్రికాషన్ డోసులు అందించారు. కాగా.. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 12,206 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 120 మంది మృతి చెందినట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదైంది. అయితే అనధికారికంగా వెయ్యి మందికి పైగా కోవిడ్‌తో మృతి చెంది ఉంటారని తెలుస్తోంది. ఇప్పటి వరకు 3,66,122 కోవిడ్ పరీక్షలు నిర్వహించగా, 12,206 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

టీకాలతో తగ్గిన ఉధృతి..

టీకాల రాకతో జిల్లాలో కరోనా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కోవిడ్ నియంత్రణకు మైక్‌ల ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. గడపగడపకూ ఆరోగ్యశాఖ సర్వే చేసి ప్రజల వివరాలు సేకరించింది. వ్యాక్సినేషన్ ప్రక్రియలో భాగంగా ఇప్పటి వరకు 9,61970 మందికి వ్యాక్సిన్లు వేశారు. వీరిలో 4,30,904 మంది మొదటి డోస్, 3,97,932 మంది రెండో డోస్, 1,33,134 మంది ప్రికాషన్ డోస్ తీసుకున్నారు. కోవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ప్రజల వ్యాక్సినేషన్‌పై ఆసక్తి చూపడం లేదు. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు జిల్లాలో వ్యాక్సినేషన్ ప్రక్రియను నిలిపివేశారు.

అప్రమత్తతే రక్ష..

ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన కొత్త సబ్ వేరియంట్ జేఎన్– 1 ప్రస్తుతం కేరళతోపాటు కర్ణాటక, ఉత్తరఖాండ్, ఢిల్లీ, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో వ్యాప్తి చెందుతోంది. బుధవారం తెలంగాణలో ఆరు పాజిటివ్ కేసులు నమోయ్యాయి. పలు మండలాలు మహారాష్ట్రతో సరిహద్దు పంచుకుంటున్నా జిల్లాలో కోవిడ్ ప్రభావం అంతగా లేదు. కొత్త వేరియంట్ లక్షణాలైన జ్వరం, ముక్కు కారడం, గొంతు నొప్పి, తలనొప్పి, కడుపు ఉబ్బరం మొదలైన లక్షణాలు ఉంటే ఆస్పత్రికి వెళ్లాలి. భౌతిక దూరం పాటించడంతోపాటు విధిగా మాస్క్‌లు ధరించడం, శానిటైజ్ చేసుకోవడం తప్పనిసరి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తుండటంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. ఈ క్రమంలో ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ప్రభావం లేదు

జిల్లాలో కోవిడ్ ప్రభావం లేదు. ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులకు పరీక్షలు చేస్తున్నాం. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బాధితులకు చికిత్స అందించేందుకు అన్ని వసతులతో సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వాసుపత్రిలో బెడ్లు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు విధిగా మాస్కులు ధరించాలి. – డాక్టర్ తుకారాం, డీఎంహెచ్‌వో

'బ్రేక్‌ఫాస్ట్' నిధులొచ్చాయ్..



సంజీవనగర్ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

- గౌరవ వేతనాలు సైతం విడుదల
- మధ్యాహ్న భోజన కార్మికులకు ఊరట

జిల్లా వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	692
విద్యార్థులు	43,125
అల్పాహారం అందిస్తున్న బడులు	475
విద్యార్థులు	15,956
విడుదలైన మెటీరియల్ కాస్ట్	రూ.33,25,928
కార్మికుల గౌరవ వేతనాలు	రూ.18,86,000

పెంచికల్‌పేట్(సిర్పూర్): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమానికి అక్టోబర్‌లో శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే అసెంబ్లీ ఎన్నికలు జరగడం, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో రెండు నెలలుగా నిధుల విడుదల ఆగిపోయింది. దీంతో పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులతోపాటు గౌరవ వేతనాలు అందక క్షేత్రస్థాయిలో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వం సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించడానికి ఇటీవల నిధులు విడుదల చేసింది. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న కార్మికులపైనే భారం..

జిల్లాలో మొత్తం 692 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 475 స్కూళ్లలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం 15,956 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అందిస్తోంది. దీని కోసం ప్రాథమిక స్థాయిలో ఒక్కో విద్యార్థికి రూ.5.45, ప్రాథమికోన్నత స్థాయిలో రూ.8.17, ఉన్నత స్థాయిలో రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నారు. వీటితోపాటు వారానికి మూడుసార్లు ప్రతి విద్యార్థికి కోడిగుడ్డు అందించేందుకు ఒక్కొక్కరికి రూ.5 చొప్పున మధ్యాహ్న కార్మికులకు చెల్లిస్తున్నారు. పెరిగిన ధరలకు తోడు సకాలంలో బిల్లులు రాక పోవడంతో కార్మికులపై అదనపు భారం పడుతుంది. దీనికి తోడు అక్టోబర్ నుంచి ప్రారంభమైన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుకు కూడా నిధులు విడుదల కాకపోవడంతో వారు సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో సరుకుల కోసం ప్రభుత్వం రూ.33.2 లక్షలు, గౌరవ వేతనాల కోసం రూ.18.8 లక్షల నిధులను విడుదల చేయడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

సకాలంలో చెల్లించాలి



సీఎం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన నిర్వహణకు నిధులు ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించాలి. రెండు, మూడు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు నెలనెలా బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.– రహమత్‌బీ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, పెంచికల్‌పేట్

నిధులు మంజూరయ్యాయి

ప్రభుత్వం ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ నిధుల విడుదల కొంత ఆలస్యం జరిగింది. రెండు రోజుల క్రితం అక్టోబర్, నవంబర్ మాసాలకు సంబంధించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ మెటీరియల్ కాస్ట్, గౌరవ వేతనాలకు నిధులు విడుదల చేసింది. నిధులను మధ్యాహ్న భోజన కార్మికుల ఖాతాల్లో త్వరలోనే జమ చేస్తాం.
– ఉదయ్‌బాబు, ఇన్‌చార్జి డీఈవో

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, అధికారులు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితా రూపకల్పనను పూర్తి చేయడంతో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవో కదం సురేశ్, అన్ని మండలాలకు చెందిన తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ త్వరలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ పేరు నమోదు చేసుకునే విధంగా చూడాలని, ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. మార్పులు చేర్పులు, చిరునామా కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు.

'సోలార్' హీటర్లకు మరమ్మతులు చేపట్టాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో చెడిపోయిన సోలార్ వాటర్ హీటర్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. బుధవారం గొడిసెల కార్తీక్‌తో కలిసి జిల్లా కేంద్రంలో గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు జిల్లాలోనే నమోదవుతున్నందున ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చలితో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.కోట్ల నిధుల వెచ్చించి సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేసినా విద్యార్థులకు ఉపయోగపడటం లేదన్నారు. చన్నీటితో స్నానాలు చేయలేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సోలార్ వాటర్ హీటర్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. క్రీడాకారులను బుధవారం జిల్లా కేంద్రంలోని పాఠశాల ఆవరణలో సిర్పూర్(యూ) మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటస్వామి, పీడీ తిరుపతితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19న ఆదిలాబాద్‌లో ఎస్‌డీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్– 17 జోనల్‌స్థాయి కబడ్డీ పోటీల్లో సిర్పూర్(యూ) మోడల్ స్కూల్ విద్యార్థి లోకేశ్వర్, ఆసిఫాబాద్ ఆదర్శ పాఠశాల విద్యార్థి సాయి దీక్ష ఉత్తమ ప్రతిభ చూపారని తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆదివాసీ మహిళకు 'జెడ్పీ చైర్‌పర్సన్' ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా పరిషత్ పదవిని ఆదివాసీ మహిళకు కేటాయించాలని జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి బుధవారం బహుజన ఐక్యవేదిక, బీజేపీ, బీఎస్పీ లీగల్ అబ్జర్వర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా నిబంధనలకు విరుద్ధంగా నాన్‌ట్రైబల్ వ్యక్తిని నియమించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు, నాయకులు బానోత్ జగన్, కిషోర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ చేసే అవకాశం కల్పించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ విద్యార్థులకు అప్రెంటీస్ చేసే అవకాశం కల్పించాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. బుధవారం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కేశవులును కలిసి విద్యార్థుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రెబ్బెన మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ చదువుతున్న విద్యార్థులు అప్రెంటీస్ పూర్తి చేస్తేనే నర్సు, ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగాలకు అర్హత సాధిస్తారని తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్ వంటి పట్టణాల్లో గదులను అద్దెకు తీసుకుని వారు అష్టకష్టాలు పడుతూ అప్రెంటీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో అవకాశం కల్పిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డీఐఈవో నైతం శంకర్ ఉన్నారు.

వణుకుతున్న సిర్పూర్(యూ)

- రాష్ట్రంలోనే అత్యల్పంగా 7.1 డిగ్రీలుగా నమోదు
- జిల్లాపై చలి పంజా



కౌటాలలో చలిమంట కాగుతున్న గ్రామీణులు

కౌటాల(సిర్పూర్): జిల్లాపై చలి పంజా విసురుతోంది. ఏజెన్సీ మండలమైన సిర్పూర్(యూ)లో ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఈ శీతాకాలం సీజన్‌లో తొలిసారి కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల దిగువకు పడిపోయాయి. బుధవారం రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత సిర్పూర్(యూ) మండల కేంద్రంలో 7.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. కశ్మీర్‌ను తలపించే చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే తిర్యాణి మండలం గిన్నెధరిలో 8.1 డిగ్రీలుగా నమోదు కాగా.. తిర్యాణిలో 8.9, కెరమెరిలో 9.1, కెరమెరి మండలం ధనోరాలో 9.5, ఆసిఫాబాద్‌లో 10.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరి కొద్దిరోజుల పాటు చలితీవ్రత కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

అవిశ్వాసం నోటీసు అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ గిరీశ్‌కుమార్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ పలువురు కౌన్సిలర్లు బుధవారం జిల్లా కేంద్రంలో డీఆర్‌వో కదం సురేశ్‌కు నోటీసు అందించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే చైర్మన్, వైస్ చైర్మన్లుగా కొనసాగుతున్నారు. 30 మంది కౌన్సిలర్లకుగాను చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు మరో ముగ్గురు కౌన్సిలర్లు మినహా మిగిలిన వారందరూ అవిశ్వాసానికి మద్దతు తెలపడం గమనార్హం. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని ఆరోపించారు. అభివృద్ధికి సహకరించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఒంటెద్దు పోకడలను భరించలేక 24 మంది ఏకతాటిపైకి వచ్చి అవిశ్వాస తీర్మానాన్ని డీఆర్‌వోకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివప్రసాద్, సాగరిక, శ్రీలత, జయచంద్ర, ఝాన్సీ, సుమతల తదితరులు ఉన్నారు. కాగా.. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలు పెడుతుండగా.. కాగజ్‌నగర్‌లో మాత్రం స్వపక్ష కౌన్సిలర్లే అవిశ్వాసం కోరడం కొసమెరుపు.



డీఆర్‌వో సురేశ్‌కు అవిశ్వాస నోటీసు అందిస్తున్న కౌన్సిలర్లు

కడెం క్రాప్ హాలీడే

- ప్రస్తుతం ప్రాజెక్టులో నీటినిల్వలు 4.02 టీఎంసీలు
- 1.2 టీఎంసీలతో చెరువులు, కుంటలు నింపే యోచనలో అధికారులు
- యాసంగిలో పంటలకు నీరందించని పరిస్థితి
- నిరాశలో ఆయకట్టు రైతులు



కడెం ప్రాజెక్టు

జన్నారం(ఖానాపూర్): కడెం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా చివరి ఆయకట్టుకు నీరందలేదు. వారబంధీ విధానంతో నీరందించారు. అయినా కొందరు రైతుల పొలాలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయి. దీంతో ప్రస్తుతం ప్రధాన కెనాల్‌కు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ రబీ సీజన్‌లో క్రాప్ హాలీడే ప్రకటించే యోచనలో అధికారులు ఉన్నారు. వేసవిలో నీటికి ఇబ్బంది రాకుండా చెరువులు, కుంటలు నింపేందుకు మాత్రమే నీటిని వదిలే అవకాశం ఉంది.

68,150 ఎకరాల్లో సాగు..

కడెం ప్రాజెక్టు ద్వారా నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68,150 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు కురియడంతో కడెం ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. నైజాం కాలంలో నిర్మించిన ప్రాజెక్టు కావడంతో గేట్లు మొరాయించడం, పలు కారణాల వల్ల వర్షాకాలంలో వచ్చిన నీరంతా వృథాగా పోయింది. మిగిలిన నీటితో ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరందించడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గింది. ప్రాజెక్టు పరిధిలోని 1 నుంచి 8 డిస్ట్రిబ్యూటరీలు కడెం, దస్తురాబాద్ మండలాలు, 9 నుంచి 22 డిస్ట్రిబ్యూటరీలు జన్నారం మండలం, 23 నుంచి 28 డిస్ట్రిబ్యూటరీలు దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలంలో నీటిని అందిస్తాయి. జన్నారం మండలంలో కడెం జలాశయంలోని డీ 9 నుంచి 22 వరకు సుమారుగా 13 వేల ఎకరాలు, డీ 22 నుంచి 28 వరకు దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరకు సుమారుగా 40 వేల ఎకరాల వరకు నీరందిస్తుంది.

చెరువులు నింపడంతోనే సరి..

కడెం జలాశయంలో నీరు లేకపోవడంతో యాసంగి సీజన్‌లో పంటలకు నీరందించే పరిస్థితి లేదు. ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో మూడు టీఎంసీల నీరు స్టోరేజీ ఉండగా కేవలం 1.02 టీఎంసీల నీటితో రబీ పంటకు నీరందించే పరిస్థితి లేదని తేల్చిచెప్పేశారు. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా రబీ సీజన్‌లో పంటలకు నీరిందించేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రస్తుతం 4 టీఎంసీల నీటితో పంటలకు సరిపడా నీరందించే పరిస్థితి లేదు. దీంతో ఉన్న 1.02 టీఎంసీల నీటితో కడెం ఆయకట్టు కింద గల చెరువులు, కుంటలను నింపి వేసవిలో నీటికి ఇబ్బంది కలుగకుండా చూసేందుకు అధికారులు యోచిస్తున్నారు. కాగా వానాకాలంలో మంచి పంటలు పండించిన రైతులు ప్రస్తుత యాసంగిలో పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే వరి నారు మడులు సిద్ధం చేశారు. ప్రాజెక్టు నీటిని వదులుతారనే ఆశతో ఉన్న రైతులకు క్రాప్ హాలీడే నిరాశ నింపే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం

కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు మాత్రమే నిల్వఉంది. ఈ నీటితో రబీ పంటలకు నీటిని వదలడం సాధ్యం కాదు. ఉన్నతాధికారులతో చర్చలు జరుగుతున్నాయి. రబీ సాగుకోసం కాకుండా ఆయకట్టు కింద చెరువులు, కుంటలు నింపేందుకు నీటిని విడుదల చేసేందుకు చర్చిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నీటిని విడుదల చేయడం జరుగుతుంది.

– బోజేదాస్, డీఈ, కడెం ప్రాజెక్ట్

క్లుప్తంగా

‘బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి’



పాదయాత్ర చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తా నుంచి నస్పూర్‌లోని కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, పారిశ్రామిక రంగాలలో బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు గజెల్లి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు బొడెంకి మహేష్, నాయకులు కీర్తి బిక్షపతి, శ్రీపతి రాములు, వెంకటేశ్, రాజన్న, బోరే శేఖర్, చంద్రమౌళి, బైర మల్లేష్, అంజన్న, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లవాగులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం లభించిందని ఎస్సై రాజేందర్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య



మల్లీశ్వరి మృతదేహం

కాసిపేట(బెల్లంపల్లి): బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం లక్సెట్టిపేట మండలం మోదెల గ్రామానికి చెందిన కుసనపల్లి మల్లీశ్వరి(50) కుమారుడు సాయికృష్ణ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతోంది. మంగళవారం సాయంత్రం దేవాపూర్‌లో నివాసం ఉంటున్న పెద్ద కూతురు శాతరాశి శైలజ ఇంటికి భర్త చంద్రయ్యతో కలిసి వెళ్లింది. రాత్రి భోజనం చేసి పడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున బావిలో దూకింది. కుటుంబ సభ్యులు తాడు సాయంతో బావిలో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, బాక్సింగ్ కోచ్ రాజేశ్ తెలిపారు. అండర్–14 విభాగంలో మంచిర్యాలకు చెందిన బి.రుత్విక్(32–34 కేజీలు), బి.అనురాగ్(46–48 కేజీలు), కాగజ్‌నగర్‌కు చెందిన కే.సాయిప్రణయ్(34–36 కేజీలు), అండర్–17 విభాగంలో మంచిర్యాలకు చెందిన ఏ.ప్రేమ్‌కుమార్(63–66కేజీలు) గోల్డ్‌మెడల్ సాధించారని తెలిపారు. వీరు ఈ నెల 24 నుంచి 29వరకు మహారాష్ట్రలోని ఆకోలాలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.



జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వాలీబాల్ పోటీల్లో..



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన శ్రీవర్షిని

చెన్నూర్‌రూరల్: ఈ నెల 22 నుంచి 27 వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు చెన్నూర్ మండలం ఆస్నాద్ జెడ్పీహెచ్‌ఎస్ ఏడో తరగతి విద్యార్థిని శ్రీవర్షిని ఎంపికై నట్లు పీఈటీ గాజుల శ్రీనివాస్ తెలిపారు. నారాయణ్‌పేట్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు చాంపియన్ షిప్ సాధించగా శ్రీవర్షిని ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచిందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, సర్పంచ్ నాగభూషణం, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అభినందించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు నాయిని శ్రీజ, మంచర్ల అంజలితో హెచ్‌ఎం, పీఈటీ

రాష్ట్ర స్థాయి పోటీలకు ..

నెన్నెల: మండలంలోని మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు నాయిని శ్రీజ, మంచర్ల అంజలి అండర్–17 కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను పాఠశాల కమిటీ చైర్మన్ భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.



సహస్రను అభినందిస్తున్న హెచ్‌ఎం జోబిన్

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు..

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 క్రికెట్ పోటీల్లో స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సహస్ర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23నుంచి 27వరకు కొత్తగూడేంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననుంది. సహస్రను ప్రధానోపాధ్యాయుడు జోబిన్, పీఈటీ రాజేందర్ అభినందించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి




సల్మాన్‌ఖాన్(ఫైల్)

భీమిని(బెల్లంపల్లి): చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సల్మాన్ ఖాన్ (22) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం భీమిని మండలంలోని కమలాపూర్ ప్రాజెక్టు వద్ద వాచ్‌మెన్‌గా ఉన్న బలరాంఆది సర్కార్‌కు నిత్యావసర సరుకులు ఇవ్వడానికి వెళ్లాడు. ప్రాజెక్టులో చేపలు పడతానని నాటుపడవలో వెళ్లడంతో ప్రమాదవశాత్తు పడవ అడ్డం తిరిగింది. దీంతో ప్రాజెక్టులో పడి మృతి చెందాడు. ఎంతసేపటికీ ఒడ్డుకు చేరుకోకపోవడంతో బలరాం ఆది సర్కార్ మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. బుధవారం ఉదయం మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు గజ ఈతగాళ్లతో ప్రాజెక్టులో వెతికించగా మృతదేహం లభించింది. మృతుని సోదరుడు గౌస్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్తి ఏరేందుకు వెళ్తూ మృత్యు ఒడిలోకి..

- ప్రమాదవశాత్తు ఆటోలోంచి కిందపడి యువతి మృతి



అఖిల(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): పత్తి ఏరేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు యువతి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాల్వాయినగర్‌కు చెందిన దుర్గం అఖిల(18) బుధవారం గంగాపూర్ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరడానికి ట్రాలీ ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడింది. అపస్మారస్థితిలోకి వెళ్లడంతో వెంటనే కౌటాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని, వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

డ్రైవర్ అజాగ్రత్త.. విద్యార్థికి గాయాలు

నేరడిగొండ: కుప్టి జాతీయ రహదారిపై ఉదయం టాటా మ్యాక్స్ వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. బుధవారం ఇచ్చోడ వైపు నుంచి టాటా మ్యాక్స్ వాహనంలో ముక్రా గ్రామానికి చెందిన విద్యార్థులను తీసుకొస్తుండగా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో ఇందులోని ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఇచ్చోడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంచిర్యాలక్రైం: ‘గాంధారి ఖిల్లాకాడ మాసక్కని సిన్మా ముచ్చట్లు’ పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సినీ గేయ రచయిత అక్కల చంద్రమౌళి మాట్లాడుతూ గాంధారి ఖిల్ల కాడ మాసక్కని సిన్మా ముచ్చట్లు అనే ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో తెలుగు సినిమాకు చెందిన ప్రముఖ, దర్శకులు, రచయితలు, ఉమ్మడి జిల్లాకు చెందిన సినీ కళాకారులు పాల్గొంటారన్నారు. ప్రాంతీయ జీవితాలను కథలుగా, సినిమాలుగా రూపొందించే అంశాలపై చర్చిస్తామన్నారు.

గంజాయి స్వాధీనం



నిందితుడిని చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఏరియా లో బుధవారం గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బెల్లంపల్లి బస్తీకి చెందిన షేక్ జమీర్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 350 గ్రాముల గంజాయి లభించింది. గత నెలలో కూడా అతని వద్ద పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జమీర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాసపత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

నెన్నెల(బెల్లంపల్లి): నెన్నెల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బీఆర్‌ఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్‌పై అధికార కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు బుధవారం జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్‌రెడ్డికి అవిశ్వాస తీర్మాణ పత్రం అందజేశారు. మండలంలో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను 8 మంది కాంగ్రెస్, ఐదుగురు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు ఉన్నారు. కాంగ్రెస్‌కు 8 మంది డైరెక్టర్లు ఉండటంతో అవిశ్వాసం నెగ్గనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ల విషయంలో మంతనాలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పదవులు కట్టబెట్టాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీ అధినాయకత్వానికి సూచిస్తున్నారు. అవిశ్వాసపత్రాన్ని అందజేసిన వారిలో ఇందూరి రాజ్‌కుమార్, గట్టు మల్లేశ్, పోచిరెడ్డి, చీర్ల రామక్క, మెండి నర్సయ్య, లింగయ్య, రాజమొగిళి, శారద ఉన్నారు.

నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి



సమావేశంలో పాల్గొన్న జీఎం, అధికారులు

శ్రీరాంపూర్: నాణ్యమైన బొగ్గును రవాణా చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్ (ఆపరేషన్), వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్పత్తి అవుతున్న బొగ్గు, అవుతున్న రవాణా వివరాలను జీఎం వారికి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గును ఉత్పత్తి చేయాలని, అదే సమయంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిని లక్ష్యాన్ని కూడా అధిగమించాలన్నారు. నాణ్యమైన బొగ్గును సరఫరా చేసినప్పుడే వినియోగదారుల మన్నలను చూరగొంటామన్నారు. ఈ సమావేశంలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఎం శ్రీనివాస్, వీ పురుషోత్తం రెడ్డి, డీజీఎం చిరంజీవిలు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలతో సింగరేణిలో మార్పురావాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): గుర్తింపు సంఘం ఎన్నికలతో సింగరేణిలో మార్పు తీసుకురావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. బుధవారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఇప్పటి వరకు గెలిచిన ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్‌ల వల్ల కార్మికులకు నష్టమే జరిగిందన్నారు. వారి హయాంలో భూగర్భ గనులు మూతపడి ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయన్నారు. ఈ వ్యవస్థ మారాలన్నా సింగరేణిలో పూర్తి మార్పులు జరగాలన్నా రాబోయే ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలన్నారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు సదానందం, శ్రీనివాస్, శ్రీపతి బానేష్, సంఘం రాజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయిస్తాం

- జీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): గుర్తింపు సంఘం ఎన్నికల్లో తాము గెలిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు వసూలు చేయిస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బుధవారం ఆర్కే 7 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రూ.29 వేల కోట్లు రావాల్సి ఉందన్నారు. ఈ డబ్బులు చెల్లించకపోవడంతో కంపెనీ ఆర్థిక ఇబ్బందుల్లో పడిందన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా ఇబ్బందిగా మారిందన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నివారిస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. బీఎంఎస్ గెలిస్తే కార్మికులకు ఎన్నికల సమయంలో తాము ఇస్తున్న హామీలన్నీ అమలు చేస్తామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాగిడి శ్రీకాంత్, మోతే ఓదెలు, గొల్ల మహేందర్, మద్దెల శ్రీనివాస్, బోయిన మల్లేశ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రాత్మక హక్కులు సాధించాం



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘంగా తాము చరిత్రాత్మక హక్కులు సాధించామని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిన ఘనత తమదేనన్నారు. కార్మికుల క్వార్టర్లకు ఏసీ పెట్టుకున్న సౌకర్యం కల్పించామని, విద్యుత్ బిల్లులు మాఫీ చేయించామని, లాభాల వాటా 32 శాతం పెంపుదల, కోలిండియాలో లేకున్నా మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాల్లో అవకాశం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, ఇంకా అనేక హక్కులు సాధించామన్నారు. సమావేశంలో నాయకులు పెట్టం లక్ష్మణ్, మహిపాల్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంబడి తిరుపతి, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలోకి టీబీజీకేఎస్ ముఖ్యనేతలు



ఐఎన్‌టీయూసీలో చేరుతున్న నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): నిన్న మొన్నటి వరకు ఊగిసలాటలో ఉన్న టీబీజీకేఎస్ ముఖ్యనేతలు ఎట్టకేలకూ యూనియన్‌కు గుడ్‌బై చెప్పి ఐఎన్‌టీయూసీ తీర్థం పుచ్చుకున్నారు. టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డివిజన్ చర్చల ప్రతినిధులు వెంగళ కుమారస్వామి, బ్రాంచి సెక్రటరీ గడ్డం మహిపాల్‌రెడ్డి, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డితో పాటు పలువురు బుధవారం రాత్రి రసూల్‌పల్లిలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ సమక్షంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. కష్టపడి పనిచేసే వారికి యూనియన్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, గరిగే స్వామి, కేంద్ర కార్యదర్శులు సమ్ము రాజయ్య, మోతె రాఘవరెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు పాల్గొన్నారు.

‘ఎల్‌ఐసీలో వేతన సవరణ చేపట్టాలి’



నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

పాతమంచిర్యాల: జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీలో ఉద్యోగులకు వేతన సవరణ వెంటనే చేపట్టాలని సంస్థ అధికారులు, ఉద్యోగులు బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 నెలల క్రితం వేతన సవరణ చేపట్టాల్సి ఉండగా యాజమాన్యం నిర్లక్ష్యం వలన అమలు కావడం లేదన్నారు. ఏటా సంస్థ లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ వేతన సవరణ చేపట్టక పోవడం సంస్థ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు సంజీవయ్య, మల్లేశ్, ఉద్యోగుల సంఘం నాయకుడు ఆర్.రాజేశం, వికాసాధికారుల (డెవలప్‌మెంట్ అధికారులు) సంఘం నాయకులు సతీష్, ప్రభాకర్, నరేష్, మాలతీదేవి, సుష్మ, శైలజ, పద్మావతి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, సౌమ్య, జగదీశ్వర్, హిమశ్రీ, మౌనిక, సోనీ పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్: వరకట్న వేధింపుల కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పునిచ్చారు. లైజనింగ్ ఆఫీసర్ కె సాగర్, ఎస్సై సీఎంఎస్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం 2019లో సిర్పూర్(టి) పోలీస్ స్టేషన్ పరిధిలోని డోర్‌పల్లి గ్రామ పంచాయతీ రామ్‌నగర్‌కు చెందిన సూర ఎల్లక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆడె మహేశ్‌పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై మధుకర్, డీఎస్పీ సుధీంద్ర, స్వామి విచారణ చేపట్టారు. సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడంతో న్యాయమూర్తి నిందితుడికి పైశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.